రెండు నెలల్లో టెస్లా విక్రయాలు!

గరిష్ఠ ధర రూ.2 కోట్లకు పైమాటే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: అమెరికాకు చెందిన ఈవీల సంస్థ టెస్లా భారత్‌లో అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. వచ్చే రెండు నెలల్లో తన తొలి షోరూంను ముంబైలో లేదా ఢిల్లీలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌తోపాటు న్యూఢిల్లీలోని ఏరోసిటీలో అవుట్‌లెట్‌ను తెరిచేయోచనలో సంస్థ ఉన్నది. 2022లో భారత్‌లో అడుగుపెట్టాలని చూసిన సంస్థ..భారత ప్రభుత్వం విధిస్తున్న సుంకాలపై బహిరంగంగానే విమర్శలు గుప్పించి వెనక్కితగ్గింది. మళ్లీ ఇప్పుడు ఇక్కడి మార్కెట్లో అడుగు పెట్టడానికి రెడీ అయింది. కంపెనీ ఎన్ని మాడళ్లు, ధర ఎంత అనేదానిపై స్పష్టం చేయకపోయినప్పటికీ.. అమెరికాలో ఆయా మాడళ్ల ధర ఆధారంగా ఇక్కడి ధరలను నిర్ణయించే అవకాశం ఉన్నది. ప్రారంభ ధర రూ.21 లక్షలు(25 వేల డాలర్లు) స్థాయిలో ఉంటుందని అంచనా. దీంతోపాటు టెస్లా సైబర్‌ట్రక్ రూ.50.70 లక్షలు, మాడల్ 2 రూ.45 లక్షలు, మాడల్ 3 రూ.60 లక్షలు, మాడల్ వై రూ.70 లక్షలు, మాడల్ ఎస్ రూ.1.50 కోట్లు, మాడల్ ఎక్స్ రూ.2 కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా.

తీవ్ర ఊగిసలాటలో సూచీలు

ముంబై, ఫిబ్రవరి 19: దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు భారీగా నష్టపోవడంతో ఒక దశలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలే ఇందుకు కారణం. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 28.21 పాయింట్లు నష్టపోయి 75,939.18 వద్దకు చేరుకోగా, నిఫ్టీ 12.40 పాయింట్లు కోల్పోయి 22,932.90 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను విధించనున్నట్లు మరోసారి స్పష్టంచేయడంతో దేశీయ ఐటీ షేర్లు కుప్పకూలాయి. ముఖ్యంగా టీసీఎస్, ఇన్ఫోసిస్ షేరు 2 శాతానికి పైగా నష్టపోయింది. దీంతోపాటు హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. కానీ, జొమాటో షేరు 5 శాతం వరకు లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. అలాగే ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ 1.33 శాతం, టెక్నాలజీ 1.31 శాతం పతనం చెందగా..ఇండస్ట్రియల్స్ 2.59 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.19 శాతం, మెటల్ 1.41 శాతం, సర్వీసెస్ 1.41 శాతం, కమోడిటీస్ సూచీలు లాభపడ్డాయి.

సైయెంట్ సీఈవోగా సుకమల్ బెనర్జీ

హైదరాబాద్, ఫిబ్రవరి 19: హైదరాబాద్ కేంద్రస్థానంగా ఐటీ కార్యకలాపాలు అందిస్తున్న సైయెంట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా సుకమల్ బెనర్జీ నియమితులయ్యారు. ఈ నియామకం బుధవారం నుంచి అమలులోకి వచ్చినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ఐదేండ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. మెకానికల్ ఇంజినీరింగ్, ఎంబీఏ ఫైనాన్స్ చేసిన ఆయనకు టెక్నాలజీ విభాగంలో మంచి పట్టున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.1,926.4 కోట్ల ఆదాయంపై రూ.122.3 కోట్ల నికర లాభాన్ని గడించింది.

బీమా-ఏఎస్‌బీఏ

ప్రీమియం చెల్లింపుల కోసం పాలసీదారులకు సరికొత్త సదుపాయం

పరిచయం చేసిన ఐఆర్డీఏఐ-వచ్చే నెల 1 నుంచి అందుబాటులోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ.. పాలసీదారుల కోసం బీమా-ఏఎస్‌బీఏ (అప్లికేషన్స్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్) పేరిట ఓ సరికొత్త ప్రీమియంల చెల్లింపు విధానాన్ని పరిచయం చేసింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ప్రీమియం చెల్లింపు కోసం పాలసీదారులు తమ బ్యాంక్ ఖాతాల్లో సరిపడా నిధులను నిలుపుదల చేయడానికి ఇది దోహదపడుతుందని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) తెలిపింది. జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రీమియం చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడమే దీని ఉద్దేశమని పేర్కొన్నది. కాగా, మార్చి 1 నుంచి బీమా-ఏఎస్‌బీఏ సౌకర్యం అందుబాటులోకి రానున్నది. దీన్ని అమలు చేయాలని బీమా సంస్థలకు ఐఆర్డీఏఐ తాజాగా స్పష్టం చేసింది. నిజానికి ఏఎస్‌బీఏ లేదా యూపీఐ ద్వారా ఖాతాల్లో నగదు నిలుపుదల సదుపాయాన్ని స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్లు ఎప్పట్నుంచో విరివిగా వాడుతున్నారు.

ఇదీ సంగతి..

జీవిత బీమా లేదా ఆరోగ్య బీమా తీసుకోవాలనుకునేవారికి పాలసీ ఆమోద సమయంలో నగదు సమస్య రాకుండా, ప్రీమియం చెల్లింపులు ఆగిపోకుండా ఉండేందుకు ఈ బీమా-ఏఎస్‌బీఏ సౌకర్యం కలిసిరానున్నది. మనలో చాలామంది బీమా పాలసీలను కొనాలని నిర్ణయించుకొని, ఆ ప్రక్రియ మొదలుపెట్టాక.. మధ్యలో నగదు లేక వెనకడుగు వేస్తూంటారు. ఇలాంటివారు బీమా-ఏఎస్‌బీఏను ఎంచుకొంటే తప్పక బీమా రక్షణను పొందగలరని ఐఆర్డీఏఐ ఆశిస్తున్నది. దేశ ప్రజలందరికీ బీమా రక్షణ లభించాలన్న లక్ష్యంలో భాగంగానే దీన్ని తెచ్చారు. ఇక పాలసీదారుల బ్యాంక్ ఖాతాలో ఒకసారి బీమా ప్రీమియంకు సంబంధించిన నగదు ఆగితే.. పాలసీ జారీ అయ్యాకే సదరు బీమా సంస్థకు ఆ సొమ్ము బదిలీ అవుతుంది. కాబట్టి పాలసీదారుల నగదుకు పూర్తి భద్రత ఉన్నట్టే. యూపీఐ ద్వారా వన్-టైమ్ మ్యాండేట్ (ఓటీఎం) సహాయంతో తమ బ్యాంక్ ఖాతాల్లో కస్టమర్లు నిర్దిష్ట నగదును నిలుపుదల చేయవచ్చు. ఒకవేళ బీమా పాలసీ ప్రతిపాదన తిరస్కరణకు గురైతే ఈ నగదు తిరిగి ఖాతాదారునికి అందుబాటులోకి రాగలదు. అయితే అప్పటిదాకా ఆ సొమ్మును ఖాతాదారులు కూడా వాడుకోలేరు.

ఎలా పనిచేస్తుంది?

- బీమా కోసం దరఖాస్తు చేసుకొనే వ్యక్తిగత పాలసీదారులు ఫారంలో బీమా-ఏఎస్‌బీఏ సదుపాయాన్ని ఎంచుకోవాలి.
- బీమా సంస్థ తమ భాగస్వామి బ్యాంక్ ద్వారా బీమా ప్రీమియం సొమ్మును ఖాతాలోనే నిలుపుదల చేయాలని పాలసీదారుని బ్యాంక్‌కు విజ్ఞప్తి చేస్తుంది.
- పాలసీదారుని అంగీకారంతో బీమా ప్రీమియం చెల్లింపునకు సరిపడా నగదును ఖాతాలోనే బ్యాంక్ ఆపేస్తుంది. ఈ సమాచారాన్ని బీమా సంస్థకూ బ్యాంక్ తెలియజేస్తుంది.
- ఖాతాలో నిలిచిపోయిన నగదుకు వడ్డీ ఆదాయం కూడా ఉంటుంది. కానీ బీమా సంస్థ తుది నిర్ణయం వచ్చేదాకా దాన్ని కస్టమర్లు తీసుకోలేరు.
- కస్టమర్ పాలసీని బీమా సంస్థ ఆమోదిస్తే.. అప్పుడు సదరు కంపెనీ విజ్ఞప్తి మేరకు ఖాతా నుంచి ప్రీమియం సొమ్మును బ్యాంక్ బదిలీ చేస్తుంది.
- బీమా పాలసీ తిరస్కరణకు గురైతే ఖాతాలో నిలిపిన నగదు మొత్తాలు పూర్తిగా ఖాతాదారునికి అందుబాటులోకి వస్తాయి.
- 14 రోజుల్లోగా బీమా దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకపోతే బ్యాంకులు ఖాతాలోని సొమ్మును అన్‌బ్లాక్ చేసేస్తాయి. అప్పుడు ఖాతాదారుడు దాన్ని తన ఇతర అవసరాలకు వాడుకోవచ్చు.

దేశీయ ఫార్మాకు కష్టకాలం!

ట్రంప్ 25 శాతం సుంకం విధించనుండటంతో ఎగుమతులపై ప్రభావం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశీయ ఫార్మా రంగానికి కష్టకాలం మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఫార్మా సంస్థలపై పిడుగుపడినట్లు అయింది. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే సెమికండక్టర్లు, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులపై 25 శాతం లేదా అంతకంటే ఎక్కువగా పన్ను వేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికా జనరిక్ ఔషధ మార్కెట్‌పై ఆధారపడివున్న దేశీయ ఫార్మా సంస్థలకు ఇది చేదువార్త. 2024లో భారత్ నుంచి అమెరికాకు 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయి. మొత్తం ఎగుమతుల్లో వీటి వాటా 31 శాతంగా ఉన్నది. ట్రంప్ తీసుకున్న తాజా నిర్ణయంతో అక్కడి మార్కెట్లో విక్రయించనున్న జనరిక్ ఔషధ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉన్నది. దీంతో అమెరికన్లు దేశీయ జనరిక్ ఔషధాల కొనుగోలు తగ్గించి, అక్కడి ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశాలుంటాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. యూఎస్‌లో వినియోగిస్తున్న జనరిక్ ఔషధాల్లో సగం భారత్ నుంచి దిగుమతి చేసుకుంటున్నవే కావడం విశేషం. దీంతో ఏటా అమెరికా 408 బిలియన్ డాలర్ల ఆదా అవుతున్నది.

కంపెనీలపై ప్రతికూల ప్రభావం..

టారిఫ్‌ల దెబ్బతో సన్‌ఫార్మాస్యూటికల్స్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, బయోకాన్ వంటి సంస్థలు భారీగా నష్టపోనున్నాయి. 2024లో సన్‌ఫార్మాకు వచ్చిన మొత్తం ఆదాయంలో అమెరికా నుంచి 32 శాతం సమకూరింది. ఈ టారిఫ్‌లపై కంపెనీ ఎండీ దిలీప్ సంఘ్వీ మాట్లాడుతూ..అదనపు సుంకాలు విధించడంతో సంస్థపై పడనున్న భారాన్ని వినియోగదారులపై మోపనున్నట్లు చెప్పారు. ఫార్మా ఉత్పత్తుల ధరలు పెంచకతప్పదని ఆయన సంకేతాలిచ్చారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ ఫార్మా సంస్థలతోపాటు కొనుగోలుదారులపై కూడా పడనున్న దన్నమాట. 100 దేశాలకు తన ఔషధాలను ఎగుమతి చేస్తున్న సంస్థకు వచ్చే మొత్తం ఆదాయంలో వీటి వాటా 72.7 శాతంగా ఉండటం విశేషం. అలాగే డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు వచ్చిన ఆదాయంలో 47 శాతం ఉత్తర అమెరికా నుంచి సమకూరుతున్నది. వీటిలో ఆంకాలజీ, ఇమ్యునాలజీ థెరపీకి సంబంధించిన జనరిక్ ఔషధాలు అత్యధికంగా అమ్ముడవుతున్నాయి. దేశంలో మూడో అతిపెద్ద ఔషధ సంస్థ సిప్లా ఆదాయంలో 30 శాతం ఉత్తర అమెరికా నుంచి సమకూరుతున్నది.

బుధవారం హైదరాబాద్‌లోని కాస్మోస్ సహకార బ్యాంక్ ఎంజీ రోడ్ శాఖ 18వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బ్యాంక్ జనరల్ మేనేజర్ ఉమేష్ బెల్జే, డీజీఎం జితేంద్ర అంబార్కర్, ఏజీఎం ఏ సందీప, చీఫ్ మేనేజర్లు వీ గౌతమ్ రాయ్, నీ రమేశ్, బ్రాంచ్ మేనేజర్ వీ సంధ్యా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ఆల్‌టైమ్ హైకి బంగారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైకి చేరుకున్నాయి. బుధవారం ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి విలువ రూ.900 పుంజుకొని రూ.89,400లుగా నమోదైంది. తొలిసారి గత శుక్రవారం (ఫిబ్రవరి 14) ఇదే స్థాయికి ధరలు పెరిగిన విషయం తెలిసిందే. అయితే సోమవారం ఒక్కరోజే ఏకంగా రూ.1,200 పడిపోయింది. కానీ మంగళవారం రూ.300 పెరిగిన నేపథ్యంలో మళ్లీ రేటు రికార్డు గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడికి పెరిగిన డిమాండ్, భారతీయ విపణిలో హోల్‌సేల్, రిటైల్ నగల వ్యాపారుల కొనుగోళ్లు ధరల్ని పరుగులు పెట్టించాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. కాగా, ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తులం బంగారం ధర దేశీయ మార్కెట్‌లో రూ.10,010 పెరిగింది. జనవరి 1న రూ.79,390గా ఉన్నది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో తులం 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.700 ఎగబాకి రూ.87,650గా.. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాములు రూ.650 ఎగిసి రూ.80,350గా ఉన్నది.

సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో బండ ప్రకాశ్

ఏకగ్రీవంగా తెలంగాణ జూడో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తపల్లి, ఫిబ్రవరి 19 : తెలంగాణ జూడో సంఘం నూతన కార్యవర్గాన్ని (2025-2029) బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని హోటల్ మైత్రీలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్ పరమేశ్వర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి పరిశీలకులుగా జాయ్ వర్గీస్ కే, తెలంగాణ ఒలింపిక్ సంఘం నుంచి పీ మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ నుంచి వీ శ్రీనివాస్ హాజరయ్యారు. నాలుగేండ్ల పాటు ఈ కార్యవర్గం పని చేస్తుందని ఎన్నికల అధికారి పరమేశ్వర్ ప్రకటించారు. తెలంగాణ జూడో సంఘం అధ్యక్షుడిగా బండ రాజ్‌కుమార్(వరంగల్), ప్రధాన కార్యదర్శిగా గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి(కరీంనగర్), ఉపాధ్యక్షులుగా కడారి అనంతరెడ్డి(కరీంనగర్), పబ్బతి బాలరాజు(యాదాద్రి భువనగిరి), బాదినేని రాజేందర్‌రెడ్డి (జగిత్యాల), మాటేటి సంజీవ్‌కుమార్(పెద్దపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రాయిరెడ్డి శంకర్‌రెడ్డి(సిద్దిపేట), సిలివేరి మహేందర్(పెద్దపల్లి), తిప్పారపు సత్యనారాయణ(రాజన్న సిరిసిల్ల), చందన గిరి నాగరాజు(వరంగల్), కోశాధికారిగా రాయిరెడ్డి మహేందర్‌రెడ్డి (సిద్దిపేట), కార్యవర్గ సభ్యులుగా ఏ సాయిచరణ్(ఆదిలాబాద్), వై సాయికిరణ్(నిర్మల్), కే తిరుపతిగౌడ్ (రాజన్న సిరిసిల్ల), కే రాకేశ్ (ఆసిఫాబాద్), ఏ రమేశ్‌రెడ్డి (మంచిర్యాల), ఎం శ్రీనివాస్ (జగిత్యాల) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కాగా, తెలంగాణ జూడో సంఘానికి చైర్మన్‌గా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని, తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను పలు జిల్లాల నుంచి హాజరైన జూడో సంఘం ప్రతినిధులు సన్మానించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాంపెల్లి మధు(ఫైల్)

ఐనవోలు, ఫిబ్రవరి 19: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన నాంపెల్లి మధు(34) అనే వ్యక్తి తన వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై హనుమకొండ జిల్లా కేంద్రానికి వెళ్లి స్వగ్రామానికి వెళ్లుతున్న క్రమంలో పున్నేల్ క్రాస్ సమీపంలోని ఏకశిలా ఈ టెక్నో స్కూల్ ముందు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హస్పిటల్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. మధు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పి ఉండేదేయో అని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

27న దూరవిద్య పీజీ పరీక్ష వాయిదా

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 19: ఈనెల 27న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా జరగాల్సిన దూరవిద్య పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షను మార్చి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు వేస్తూనట్లు పరీక్షల నియంత్రణ అధికారి కట్ట రాజేందర్ తెలిపారు. మిగితా పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నయీంనగర్, ఫిబ్రవరి19: సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓ స్కూల్ ఎదుట ఆటోలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. కాగా ఈ వ్యక్తి మృతి పట్ల హత్యనా.. ఆత్మహత్యనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మేడారంలో ఘనంగా తిరుగువారం పండుగ

- తల్లులకు ప్రత్యేక పూజలు చేసిన పూజారులు
- పూర్తయిన మినీ జాతర పర్వం

సమ్మక్క దేవత గద్దెను దర్శించుకుంటున్న భక్తులు,(ఇన్‌సెట్‌లో) సమ్మక్క గద్దెకు పూజలు చేస్తున్న పూజారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 19 : మండలంలోని మేడారంతోపాటు కన్నెపల్లి, సమ్మక్క దేవత పుట్టుపూర్వ బయ్యక్కపేటలో సమ్మక్క-సారలమ్మల పూజారులు బుధవారం తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ నెల12 నుంచి 15వరకు నాలుగు రోజులపాటు అమ్మవార్ల మినీ జాతరను నిర్వహించిన ఆదివాసీ పూజారులు జాతర అనంతరం వచ్చే బుధవారం తిరుగువారం పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో బుధవారం పూజారి సిద్ధబోయిన మునిందర్ ఇంటి నుంచి నీళ్లు, పసుపు, కుంకుమ, కంకణాలు తీసుకొని డోలివాయిద్యాల నడుమ సమ్మక్క దేవత పూజామందిరానికి చేరుకున్నారు. మినీ జాతర సందర్భంగా బయటకు తీసిన అమ్మవార్ల పూజాసామగ్రి, పూజలో ఉపయోగించే వస్త్రాలను సమ్మక్క దేవతను చిలకలగుట్ట నుంచి తీసుకువచ్చే పూజారి కొక్కెర క్రిష్ణయ్య నిష్టతో ఉపవాసం ఉండి శుద్ధి చేశారు. గుడిని శుద్ధి చేసి సమ్మక్క గద్దెను ముగ్గులతో అలంకరించారు. అమ్మవారికి పూజారులు మునిందర్, క్రిష్ణయ్య ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాప చల్లగా ఉండాలని కోరుకుంటు పూజలు చేశారు. అనంతరం అమ్మవార్ల పూజాసామగ్రిని తల్లి గద్దెపై ఉన్న అటుకుపై భద్రపరిచారు. బుధవారం నిర్వహించిన పూజలతో అమ్మవార్ల మినీజాతర ముగిసింది. వచ్చే ఆదివారం పూజారుల కుటుంబాలు వనభోనాలకు తరలివెళ్లనున్నారు.

భారీగా తరలివచ్చిన భక్తజనం

మేడారం సమ్మక్క-సారక్కలకు భక్తులు బుధవారం తిరుగువారం మొక్కులు చెల్లించారు. రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవార్ల గద్దెల వద్ద గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

21 నుంచి విజయవాడ సెక్షన్‌లో రైళ్లు యథాతథం

కాజీపేట, ఫిబ్రవరి 19 : కాజీపేట స్టేషన్ మీదుగా విజయవాడ సెక్షన్‌లో నడిచే పలు ప్రయాణికుల రైళ్లను ఈనెల 21 తేదీ నుంచి యథాతథంగా నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఖమ్మం రైస్టేషన్ ప్రాంతంలో చేపట్టిన మూడోలైన్ రైల్వే ఇంజినీరింగ్ పనుల కారణంగా ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు పలు ప్రయాణికుల రైళ్లను రద్దు, దారి మళ్లించి నడిపిన విషయం తెలిసిందే. పనులు పూర్తి కావడంతో శుక్రవారం నుంచి పుష్‌పుల్, గోల్కొండ, భాగ్యనగర్, ఎల్‌టీటీ, గుంటూరు ఇంటర్‌సిటీ, శాతవాహన, కాకినాడ సాయినగర్ షిర్డీ, మచిలీపట్నం షిర్డీ, ఈస్ట్ కోస్ట్ (హౌరా), కోణార్క్, కృష్ణ, శాలిమార్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను యథాతథంగా నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు

కాజీపేట, ఫిబ్రవరి 19 : కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా సికింద్రాబాద్-దానా పూర్-సికింద్రాబాద్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. సికింద్రాబా ద్ స్టేషన్‌లో జరుగుతున్న పనుల కారణంగా సికింద్రాబాద్-దానాపూర్- సికింద్రా బాద్ స్టేషన్ల మధ్య నడిచే రైలు నంబర్12791/12792 ఈ నెల 20 నుంచి 28 వరకు రద్దు చేశారన్నారు. ప్రయాణికులు గమనించాలని కోరారు. టికెట్ రిజర్వేషన్ చేసుకున్న వారికి బుకింగ్ కౌంటర్‌లో డబ్బులు వాపస్ ఇస్తారని చెప్పారు.

పలుగులలోనే పులి సంచారం..

భయాందోనళలో గ్రామస్తులు.. గాలిస్తున్న అటవీశాఖ ప్రత్యేక బృందాలు

అటవీ అధికారులు గుర్తించిన పులిపాద ముద్రలు

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 19 : మండలంలోని పలుగుల గ్రామంలోనే పులి సంచరిస్తున్నదని అటవీశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం గ్రామ శివారులో ఓ లారీ డ్రైవర్ పులి సంచారాన్ని చూసి భయంతో గ్రామంలోకి పరుగులు తీశాడు. విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న అటవీశాఖ ప్రత్యేక బృందాలు పులి జాడకోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రత్యేక ట్రూప్ కెమెరాలను ఏర్పాటు చేసి సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. గొర్రె కాపరులు, ప్రజలు అడవుల్లోకి వెళ్లొద్దని సూచించారు. పులి అనవాళ్లు కనిపిస్తే సమాచారం అందించాలని ఎఫ్‌ఆర్‌వో రవి కోరారు.

పోలీసులు పట్టించుకోవడం లేదని..

సీపీ కార్యాలయం ఎదుట వివాహిత ఆత్మహత్యాయత్నం

అడ్డుకొని కేసు నమోదు చేసిన పోలీసులు

నయీంనగర్, ఫిబ్రవరి 19 : హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ (సీపీ) కార్యాలయం ఎదుట బుధవారం ఓ వివాహిత ఆత్మహత్యకు యత్నించింది. కిరోసిన్ బాటిల్‌తో వచ్చిన ఆమె ఒంటిపై పోసుకునేందుకు యత్నించగా అక్కడే డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ పోలీసులు అడ్డుకున్నారు. సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట పూరిగుట్టకు చెందిన సంగీత మొదటి భర్తతో విడిపోయింది. అనంతరం నగరానికి చెంది ముంబయిలో ఉంటున్న ఓ వ్యక్తితో సహజీవనం చేసింది. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని అతడిపై ఒత్తిడి చేయగా అతడు వినకపోవడంతో అత్యాచార యత్నం కేసు పెట్టింది. దీంతో భయపడిన సదరు వ్యక్తి సంగీతను పెళ్లి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న అత్యాచారయత్నం కేసు విచారణ కోర్టులో ఉండడంతో సాక్ష్యం చెప్పేందుకు మహబూబ్‌నగర్ నుంచి సంగీత అక్క, బావ వచ్చారు. అయితే వారు సాక్ష్యం చెబితే తన రెండో భర్త జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, సాక్ష్యం చెప్పొద్దని అక్క, బావతో సంగీత గొడవకు దిగింది. అనంతరం సుబేదారి పోలీస్ స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేసింది. అయితే పూర్తి విషయం తెలుసుకున్న పోలీసులు బయట మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో తన ఫిర్యాదును పోలీసులు పట్టించుకోవడం లేదని సీపీ ఆఫీసు ఎదుట కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకోగా, సంగీతపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

లెనిన్‌నగర్ కాలనీలో చోరీ

రూ.1.5లక్షల నగదు, బంగారం అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 19 : పట్టణంలోని లెనిన్‌నగర్ కాలనీలో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివసిస్తున్న బెల్లం మార్కయ్య ఇటీవల స్వయం సహాయక గ్రూప్ నుంచి రూ.2లక్షలు లోన్ తీసుకున్నాడు. భార్య అనారోగ్యంతో బాధ పడుతుండగా రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బుధవారం ఉదయం పక్కింటివారు తెలియజేయగా మార్కయ్య ఇంట్లోకి వెళ్లి చూగా బీరువాలో రూ.1.50లక్షలు, తులంన్నర బంగారం అపహరించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నిందితుల అరెస్టు చూపించి, వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

కిలాడీ దంపతుల అరెస్ట్

ఒంటరి మహిళలే లక్ష్యంగా బంగారు ఆభరణాల చోరీలు

వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి

నయీంనగర్, ఫిబ్రవరి19: రద్దీగా ఉన్న ప్